క్లుప్తంగా

నేడు అధికారులతో మంత్రి రివ్యూ

అద్దంకి: మున్సిపల్ కార్యాలయంలో వచ్చే నెల ఒకటో తేదీన ఉదయం 11 గంటలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందిస్తున్న సంస్థ యాజమాన్యం

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య విద్యా సంస్థల్లో పదోతరగతి విద్యార్థులకు జ్యోతిర్మయి దేవాంగ సమితి కార్యదర్శి పింజల ప్రసాద్ సహకారంతో ఉచితంగా నోట్ పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగించుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదాలత్‌లో సత్వరమే న్యాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధా

చీరాల రూరల్: జాతీయ అదాలత్‌లో సత్వరమే న్యాయ సహాయం దొరుకుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా అన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు ఎం సుధా, ఎస్కే రెహానాలు కక్షిదారులకు న్యాయ సలహాలను అందించి 106 కేసులు పరిష్కరించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, రేవతి నక్షత్రం, అష్టమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం . మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ఈర్లగంగమ్మ ఆలయం



ఈర్లకొండ వద్ద శివుని కుటుంబం



షిర్డీ సాయిబాబా ఆలయం

ఆధ్యాత్మిక నిలయం

- ఆలయాలకు నిలయం నక్కబొక్కలపాడు
- చిన్న గ్రామంలో రూ.2 కోట్లతో ఆలయాల అభివృద్ధి



అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: ఆధ్యాత్మిక నిలయంగా మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంగా నిలిచింది. మండలంలోని కొణిదెన రెవెన్యూలోని నక్కబొక్కలపాడు గ్రామం పలు ఆలయాలకు నిలయమైంది. కొణిదెనను 12వ శతాబ్దంలో రాజులు పరిపాలించినట్లుగా చరిత్రలు చెప్తున్నాయి. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లకొండకు దిగువభాగంలో రాజుల పాలనలోనే ఈర్లగంగమ్మ స్వయంభుగా వెలిసింది. నాలుగు దశాబాదలుగా కొండ నుంచి లభించే స్టీల్ గ్రే గ్రానైట్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో గిరాకీ ఉండటంతో గ్రామస్తులు గ్రానైట్‌దార్ల సహకారంతో గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధిపరిచారు. జిల్లాతోపాటు పరిసర జిల్లాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు వస్తుండటంతో ఇక్కడ సత్రాలు నిర్మించారు. గ్రామ కూడలిలో హనుమత్ సమేత షిర్డీ సాయిబాబా అనుగ్రహ ధ్యానమందిరాన్ని నిర్మించారు. ఇక్కడ ప్రతి శని, మంగళ, గురువారాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాల, అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

5 దశాబ్దాలకు కొలుపులు..

గ్రామానికి ఆగ్నేయ భాగంలో వేంచేసివున్న పోలేరమ్మకు 5 దశాబ్దాల తదుపరి ఘటం కుండతో ఇంటింటా చద్దిసేకరణ, వారం రోజులపాటు కొలుపులు, అన్నసంతర్పణ చేపట్టారు. అంకమ్మకు కొలుపులు చేపట్టారు. గ్రామ కూడలిలోని నాభిశిలకు ప్రత్యేక పూజలతో పొంగళ్లు పెట్టారు. బలరాం కాలనీలు, ధూళిపాళ్ల వారి ఇలవేల్పు రేణుకమ్మకు 5 సంవత్సరాలకొకసారి కొలుపులు నిర్వహిస్తున్నారు. ఆలయాల అభివృద్ధికి వేడుకలకు ఎకరాల వంతున విరాళాల సేకరణ చేపడుతున్నారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పైసా లెక్కతో మిగిలిన సొమ్ము ఆలయాల ఖాతాకు జమ చేస్తున్నారు. పద్మశాలీలు, భద్రావతి



ఈర్లగంగమ్మ ఆలయంలో అమ్మవారు

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మార్టూరు: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పిల్లలు పెద్దలు, భేదం లేకుండా 80% రోగాలను దరిచేరనివ్వకుండా చూడవచ్చని ఎంపీడీవో జి నితిన్ అన్నారు. పరిశుభ్రతపై మూడు మండలాల ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మార్టూరు ఇంకొల్లు కారంచేడు మండలాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ జూలై రెండో తేదీ నుంచి 12వ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

తేదీ వరకు పరిశుభ్రతపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యార్థులకు డెటాల్ హైజిన్ ఒలింపియాడ్ పేరుతో పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు ప్రముఖ సినీనటుడు అమితాబచ్చన్ చేతుల మీదుగా రూ. 50 వేల నగదు బహుమతిని అందించనున్నట్లు నితిన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వస్రాం నాయక్, ఎంఈఓ-2 ప్రేమలత మండల రిసోర్స్‌పర్సన్లు మూడు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరుకూరు సెక్టార్‌లో ..

చినగంజాం (పర్చూరు): ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్టు పరిధిలోని చెరుకూరు సెక్టార్‌లో చేతిశుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ రాధా చెరుకూరు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

బల్లికురవ: సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకు వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో వై హనుమారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 7842 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వంద శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ బాధ్యతను మండల స్థాయి అధికారులకు గ్రామాల వారీగా అప్పగించినట్లు ఎంపీడీవో చెప్పారు. బల్లికురవ, మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి గ్రామాలను తాను, తహసీల్దార్ ఎం సుభద్ర, కొప్పరపాలెం గుంటుపల్లి, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాలను, ఈవోఆర్డీ సుమతి వేమవరం, ఉప్పుమాగులూరు వన్, టూ, కొణిదెన గ్రామాల్లో, పంచాయతీ రాజ్‌ఏఈ బీ హనుమంతరావు, కొత్తూరు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, కొప్పరపాడు గ్రామాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జే వీరాంజనేయులు, ముక్తేశ్వరం, కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్ఎల్‌గుడిపాడు గ్రామాలను పర్యవేక్షించనున్నట్లు ఎంపీడీవో వివరించారు. ఒక్కో లబ్ధిదారుడికి పెంచిన సొమ్ము రూ.4 వేలు, ఏప్రిల్, మే జూన్ నెలలకు కలిపి రూ.7 వేలు చెల్లిస్తారని చెప్పారు.

కారంచేడు: జూలై 1వ తేదీన ఉదయం నుంచి ఇంటింటికీ పింఛన్‌దారులకు నూతనంగా పెంచిన పింఛన్ల పంపిణీ చేస్తారని ఎంపీడీఓ బీ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలోని 12 సచివాలయాలకు చెందిన సుమారు 150 మంది సిబ్బందితో పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 12 సచివాలయాల పరిధిలో సుమారు 6086 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. వీరందరికీ అవసరమైన రూ 4.06 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందని, ఎంపిక చేసిన సచివాలయ సిబ్బంది ద్వారా ఈ మొత్తంను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారన్నారు.

అద్దంకి: జూలై నెల ఒకటో తేదీన పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 7,169 పింఛన్లు ఉండగా, వీటికి సంబంధించి రూ.4.80 కోట్ల నగదును సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత

బల్లికురవ: ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ మార్టూరు ఏడీఈ ఎం సురేంద్రబాబు తెలిపారు. శనివారం బల్లికురవలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇప్పటికే మండలంలో 419 కనెక్షన్లు సంతమాగులూరులో 232 కనెక్షన్లు మంజూరు అయ్యాయని చెప్పారు. బల్లికురవలో 325, సంతమాగులూరులో 419 కనెక్షన్ల కోసం దరఖాస్తులు అందాయని చెప్పారు. 5హెచ్‌పీ మోటారుకు రూ.6 వేలు డిపాజిట్టు, అప్లికేషన్‌కు రూ.200తో కలిపి రూ.6 వేలు చెల్లించాలని చెప్పారు. హెచ్‌వీడీఎస్ పథకంలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాబోయో కాలంలో కేంద్రప్రభుత్వ నిధులు ఆర్‌డీఎస్ఎస్‌లో వ్యవసాయానికి గృహాలకు సంబంధించి సబ్‌స్టేషన్ల నుంచి ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాల అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా లో ఓల్టేజీ కిందకు



మాట్లాడుతున్న ఏడీఈ

జారిన సప్లై వైర్లు, పాడై పోయిన పోల్స్‌న మార్చేందుకు అంచనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. మల్లాయపాలెం, ముక్తేశ్వరం గ్రామాలకు నూతనంగా 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని స్థల సేకరణ జాప్యంతో ముందుకు సాగలేదన్నారు. వ్యయసాయానికి 5హెచ్‌పీ మోటారుక సంబంధించి రూ.6,200 మాత్రమే చెల్లించాలని అంతకు మించి రైతులు చెల్లించాల్సిన పని లేదని ఏడీఈ వివరించారు. ఈ సమావేశంలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగం



పద్మినిబాయికి సన్మాన పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ బృందం

మార్టూరు: ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగం అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ పండిట్ పద్మినిబాయికి శనివారం ఉపాధ్యాయ బృందం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈసందర్భంగా హెచ్ ఎం బొప్పూడి బాలప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని అయితే ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం చేసిన ఘనత మాత్రం ఉపాధ్యాయులకు మాత్రమే దక్కుతుందన్నారు. అనంతరం పద్మినిబాయిని హెచ్ఎం, ఉపాధ్యాయిని బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించి సన్మానించారు. సన్మాన గ్రహీత పద్మినిబాయి పాఠశాల విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులు బహూకరించారు.

డయేరియాపై అవగాహన అవసరం

బల్లికురవ: వానాకాలం ప్రారంభమైనందున కలుషిత నీటితో డయేరియా సోకే ప్రమాదం ఉందని, గ్రామాల వారీగా ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి భారతి కోరారు. శనివారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో 104 ద్వారా ఉంచి వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు చిన్నారులను ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు. జూలై ఒకటో తేదీ నుంచి రెండు నెలల పాటు ప్రభుత్వ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, కలుషిత నీటితోపాటు చేతుల పరిశుభ్రతపై కూడా తల్లులు పిల్లలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని కోరారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి భారతి

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

చీరాల అర్బన్: బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్చాలని చీరాల మండల ఎంఈఓ-2 సుధారాణి అన్నారు. శనివారం అసఫ్ అలీ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, గంజిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో అడ్మిషన్లు పెంపునకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ సందర్భంగా బడిలో చేరిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న ఎంఈఓ-2 సుధారాణి

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

అద్దంకి: లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం దొరకడంతోపాటు ఇరు పక్షాలకు న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి డీ నాగ వెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ అదాలత్‌కు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు ఉండదని చెప్పారు. ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం రెండు బెంచ్‌ల ద్వారా 152 కేసులను పరిష్కరించారు. వాటిలో 105 క్రిమినల్ కేసులు, 8 మనోవర్తి కేసులు, 4 కుటుంబ తగాదాలు, 2 చెక్కు బౌన్స్ కేసులు, 4 గృహ హింస



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

కేసులు, 23 ప్రో నోటు కేసులు, 2 ప్రీ లిటిగేషన్ కేసులు, 2 ఎలక్షన్ పెట్టీకేసులు ఉన్నట్లు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. మొదటి బెంచ్‌ని ఎం గృహలక్ష్మి, ఎస్ ప్రకాశ్ మెంబర్లుగా వ్యవహరించారు. రెండో బెంచ్‌కు ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి జే సీత వ్యహరించారు. వారికి సహాయంగా డీ హయగ్రీవాచారి, ఎస్ నాగేశ్వరరావు మెంబర్లుగా వ్యవహరించారు. ఈ అదాలత్ కార్యక్రమంలో న్యాయవాదులు కక్షిదారులు పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని కష్టజీవుల వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అందులో ఉండే వృద్ధుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



చీరాలలో ఉద్యో విరమణ పొందిన అధ్యాపకులు, సిబ్బందిని సత్కరిస్తున్న యాజమాన్యం

చీరాల రూరల్ : ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారిని అత్యున్నత శిఖరాలకు చేర్చి ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. శనివారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులు హిందీ లెక్చరర్ డాక్టర్ కొణిదెల రమేష్, ఫిజిక్స్ లెక్చరర్ ఖాద్రీ, రికార్డు అసిస్టెంట్ వి. లక్ష్మయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా డీఐఈఓ ఎర్రయ్య పాల్గొని మాట్లాడారు. కళాశాలలో చేరిన నాటి నుంచి అధ్యాపక వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలువేశారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యా సాగర రావు , ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు, రిటైర్డు లైబ్రరియన్ పుల్లగూర జయశీలరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల నగరోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని వీరరాఘవపేటలోని సీతారామ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివార్ల నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో, పూల అలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు దిట్టకవి వాసుదేవ సంపత్ కుమార్ ఆచార్యులు, ఎస్. పార్థసారథి ఆచార్యులు నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీరామమందిర పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. ఆదివారం సరస్వతిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నగరోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు